# కేజీబీవీల్లో కొత్త చిచ్చు!

- ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులతో బోధన
- పెద్దపల్లి జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా పురుష టీచర్ల నియామకం!
- భూపతిపూర్‌లో 'మీ బోధన వద్ద'ని విద్యార్థినుల వాగ్వాదం
- విద్యార్థినిపై చేయి చేసుకున్న మహిళా టీచర్.. పిల్లల ఆందోళన



కాల్వశ్రీరాంపూర్ కేజీబీవీలో విద్యార్థినులకు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

పెద్దపల్లి, జనవరి 4 (నమస్తే తెలంగాణ): కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో కొత్త చిచ్చు మొదలైంది. డిప్యూటేషన్‌పై ప్రభుత్వ స్కూళ్ల టీచర్లు రావడంతో ఆగ్రహం వ్యక్తమవుతున్నది. కేజీబీవీల్లో పనిచేసే టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది తమ డిమాండ్ల సాధనకు 25 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. అయితే చదువులకు ఆటంకం ఏర్పడుతుండడం, వార్షిక పరీక్షలు దగ్గర పడుతుండడంలో విద్యార్థినులు, తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో సమీప ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై పంపించాలని సర్కారు నిర్ణయించి ఉత్తర్వులు జారీ చేయడంతో నిరసన వ్యక్తమవుతున్నది. దీంతో సమ్మెకు దిగిన సర్వ శిక్షా ఉద్యోగులు అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. తమ న్యాయమైన డిమాండ్లపై స్పందించకపోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటి వరకు తాము సమ్మెలో ఉన్నా ఒకరిద్దరు కేజీబీవీల్లో ఉంటున్నారని, ప్రభుత్వ టీచర్లు బోధించి వెళ్తే ఎవరు ఉంటారని ప్రశ్నిస్తున్నారు. తాము సమ్మెలో ఉన్నా.. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా కేజీబీవీలను కాపాడుకోవాలనే ఉద్దేశంతో ఇప్పటి వరకు ఒక్కో కేజీబీవీలో ఒకరు, ఇద్దరు ఉండి సంరక్షిస్తున్నామన్నారు. ఇక కేజీబీవీలకు తాళాలు వేసి ఎంఈవోలకు అప్పగిస్తామని స్పష్టం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి ఉపాధ్యాయులను పంపిస్తే అక్కడ సైతం నష్టపోయే ప్రమాదముందని, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించాలని కోరుతున్నారు.

## నిబంధనలకు విరుద్ధంగా పురుష టీచర్లు!

ప్రభుత్వ స్కూళ్ల టీచర్లను డిప్యూటేషన్ చేస్తూ ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఉపాధ్యాయులు కేజీబీవీల్లో బాధ్యతలను స్వీకరిస్తున్నారు. కాల్వశ్రీరాంపూర్ కేజీబీవీలో ప్రభుత్వోపాధ్యాయుడు రాజమౌళి, రామగుండంలో రామకృష్ణ, జూలపల్లిలో లక్ష్మీపతి, ముత్తారంలో బాలరాజు, రవి శ్రీనివాస్‌ను నియమించినట్టు తెలిసింది. అయితే నిబంధనలకు విరుద్ధంగా కస్తూర్బా స్కూళ్లకు పురుష టీచర్లను పంపించడాన్ని విద్యార్థినుల తల్లిదండ్రులు, విద్యావంతులు తప్పుపడుతున్నారు. కాగా, సుల్తానాబాద్ మండలం భూపతిపూర్ కస్తూర్బాకు శనివారం డిప్యూటేషన్‌పై ఐదుగురు ప్రభుత్వ టీచర్లు వెళ్లగా, 'మీరు మాకు వద్దు.. మాకు మా పాత టీచర్లే కావాలి. మీరు వెళ్లండి' అంటూ విద్యార్థినులు వాగ్వాదానికి దిగారు. దీంతో సహనం కోల్పోయిన ఓ ఉపాధ్యాయురాలు ఏడో తరగతి విద్యార్థిని నిహారికపై చేయి చేసుకోవడం దుమారం రేపగా, మిగతా విద్యార్థినులందరూ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. స్కూల్ ఆవరణలో ఆందోళన చేశారు.



కరీంనగర్ జిల్లా పంచాయతీరాజ్ శాఖ ఇంజినీరింగ్ విభాగం కార్యాలయంలో భద్రపరిచిన గ్రామపంచాయతీ ఎన్నికల సామగ్రి


నమస్తే తెలంగాణ

కరీంనగర్

5 | కరీంనగర్, ఆదివారం 5 జనవరి 2025 | KARIMNAGAR


# కూలిపోయిందన్న కాళేశ్వరమే దిక్కయింది

### మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

గంగాధర, జనవరి 4: 'రూ.లక్ష కోట్ల ప్రజాధనం వృథా అయింది. ప్రాజెక్టు కూలిపోయింది. అది పనికిరాదని అసత్య ప్రచారం చేసి రేవంత్‌రెడ్డి గద్దెనెక్కిండు. ప్రాజెక్టుతో కొత్తగా ఒక్క ఎకరానికి నీరందలేని అబద్ధాలు చెప్పిండు. కానీ, ఈ రోజు హైదరాబాద్ మహానగరానికి నీటి తరలింపునకు అదే ప్రాజెక్టు దిక్కయింది' అని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాళేశ్వరం కూలిపోయిందని సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడితే, ఇదే ప్రాజెక్టు ద్వారా లక్ష పై చిలుకు ఎకరాలకు సాగునీరందించడానికి ప్రభుత్వం నీటిని విడుదల చేసిందని రంగనాయసాగర్ రిజర్వాయర్ వద్ద మంత్రి కొండా సురేఖ మాట్లాడారని, మల్లన్న సాగర్ నుంచి 20 టీఎంసీలు హైదరాబాద్‌కు తరలిస్తున్నట్టు దినపత్రికల్లో వచ్చిందని, అయితే కూలిపోయిన కాళేశ్వరం నుంచి సాగు, తాగునీటిని ఎలా విడుదల చేస్తున్నారో సీఎం చెప్పాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ జలమండలిలో సమావేశం ఏర్పాటు చేసి మల్లన్నసాగర్ నుంచి హైదరాబాద్‌కు గోదావరి జలాల తరలిస్తామని ప్రకటించడంలోనే సీఎం రేవంత్‌రెడ్డి కాళేశ్వరం గొప్ప ప్రాజెక్టు అని ఒప్పుకున్నట్టయిందని పేర్కొన్నారు. ఇప్పటికైనా కాళేశ్వరం ప్రాజెక్టు అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సాధించాలని సూచించారు.

# కేసులకు భయపడేది లేదు



మాట్లాడుతున్న మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, వేదికపై మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎంపీ వినోద్, బీఆర్ఎస్ సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, కోరుకంటి చందర్, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, నాయకులు

- కాంగ్రెస్ కుట్రలు, కుతంత్రాలకు బెదిరేది లేదు
- అవసరమైతే హైకోర్టు, సుప్రీం కోర్టుకైనా వెళ్దాం
- మీకు అండగా నేనున్నా.. ధైర్యంగా ఉండండి
- ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల పక్షాన నిలదీయండి
- స్థానిక సంస్థల్లో గులాబీ జెండా ఎగురవేద్దాం
- కార్యకర్తలకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు

'కాంగ్రెస్ ప్రభుత్వం కక్షసాధింపులకు పాల్పడుతున్నది. కుట్రలు, కుతంత్రాలతో కేసులు పెడుతున్నా బెదిరేది లేదు. సామాన్య కార్యకర్తలపై భూకబ్జాల పేరిట పెడుతున్న కేసులపై హైకోర్టుకు, అవసరమైతే సుప్రీం కోర్టుకెళ్దాం. అన్యాయంగా కేసులు పెడుతున్న వారిపై పరువు నష్టం దావా వేస్తాం. మీకు అండగా నేనున్నా. ధైర్యంగా ఉండండి. కేసులకు భయపడేది లేదు. ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల పక్షాన నిలిచి కొట్లాడండి' అని బీఆర్ఎస్ శ్రేణులకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు. శనివారం సిరిసిల్లలో ఆయన పర్యటించారు. తెలంగాణ భవన్‌లో పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అధ్యక్షతన నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి హాజరై, స్థానిక సంస్థల ఎన్నికలపై దిశానిర్దేశం చేశారు.

రాజన్న సిరిసిల్ల, జనవరి 4 (నమస్తే తెలంగాణ) సిరిసిల్ల టౌన్ : 'మీకు అండగా నేనున్నా.. మీ కోసం రాష్ట్ర, జిల్లా పార్టీ ఉంది. న్యాయవాదుల బృందం ఉంది. కింద న్యాయస్థానం.. పైన దేవుడున్నాడు. తప్పకుండా న్యాయం జరుగుతుంది. ఒక్కొక్కరి సంగతి మళ్ల సూసుకుందాం. మనల్ని వేధించే వారికి వడ్డీతో సహా చెల్లిద్దాం. కేసులకు సంబంధించిన ఖర్చులు పార్టీ భరిస్తుంది. న్యాయపరంగా ఎదుర్కొనేందుకు హైకోర్టు న్యాయవాదులతో ప్రత్యేక లీగల్ సెల్ ఏర్పాటు చేశాం' అని కేటీఆర్ స్పష్టం చేశారు. భూకబ్జాలంటూ వివిధ పత్రికలలో బీఆర్ఎస్ నేతలపై వచ్చిన కథనాలను తీవ్రంగా ఖండించారు. 'భూ కుంభకోణాలు లేవు.. లంబ కోణాలు లేవు.. అవన్నీ అసత్యపు రాత'లంటూ కొట్టిపారేశారు. ఒకరో, ఇద్దరో అధికారం వచ్చిందని కేసులు పెట్టించి పైశాచికానందం పొందుతున్నారని ఫైర్ అయ్యారు. మనచేతిలో నాలుగైదుసార్లు ఓడిపోయి మతి స్థిమితం తప్పి కేసులు పెట్టిస్తున్నారని దుయ్యబట్టారు. పైన ముఖ్యమంత్రి ఎలా ఉన్నారో.. సిరిసిల్లలో వాళ్లు అలాగే ఉన్నారన్నారు. ఏ ఊరిలో ఎక్కడ ఎవరెవరు సతాయిస్తున్నారో..? రాసిపెట్టుకోవాలని, వారికి మిత్తితో సహా చెల్లించే బాధ్యత తనదని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. బరాబర్ చెబుతున్నా.. ఒక్కొక్కరికీ ఒక్కో టైం వస్తుందని చెప్పారు. టీవీలు చూసి, పేపర్లలో తాటికాయలంత అక్షరాలతో రాయంగనే ఆగం కావొద్దని ధైర్యం చెప్పారు. సోషల్ మీడియాలో కొన్ని నిజాలొస్తున్నాయని, వాటిని చూడాలని సూచించారు. ఒక్క ఓటుకు ఐదేళ్లు శిక్ష అనుభవించాల్సి వస్తుందని ప్రజలకు అర్థమైందన్నారు. నీలిరంగు పూసుకున్న ముసలి నక్క మోసాల మాదిరి కాంగ్రెస్‌ను నమ్మి మోసపోయామని ప్రజలు గుర్తించారని చెప్పారు. మనకు కూడా మంచే జరిగిందని, బాధపడవద్దని కార్యకర్తలకు సూచించారు. చేసిన చిన్నచిన్న పొరపాట్లను సరిచేసుకుంటూ ముందుకు పోదామన్నారు. కేసీఆర్ పేదలను కడుపులో పెట్టుకుని చూసుకున్నారని, కరోనా వంటి దిక్కుమాలిన పరిస్థితిలోనూ రైతుకు కష్టం రాకుండా చూసుకున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు సుంకె రవిశంకర్, దాసరి మనోహర్‌రెడ్డి, పుట్ట మధూకర్, కోరుకంటి చందర్, కేడీసీసీబీ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మినరసింహారావు,పార్టీ నాయకులు చీటి నర్సింగరావు, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, డైరెక్టర్లు, మండలాల పార్టీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



సిరిసిల్లలో హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

## రాష్ట్రంలో రాక్షస పాలన

రాష్ట్రంలో కాంగ్రెస్ రాక్షస పాలన నడుస్తున్నది. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతున్న వారిపై అక్రమ కేసులు పెడుతూ అణచివేసే ప్రయత్నం చేస్తున్నది. కేసీఆర్, కేటీఆర్‌పై అక్రమంగా కేసులు పెట్టే కుట్రలు పన్నుతున్నది. పోలీసులను అడ్డుపెట్టుకుని బీఆర్ఎస్‌నాయకులపై అక్రమ కేసులు పెట్టి భయానక వాతావరణం సృష్టిస్తున్నది. ఇది మంచి కాదు. రాజకీయాల్లో కేసులు సర్వసాధారణమే. రాష్ట్రాన్ని సాధించిన గొప్ప నాయకుడు కేసీఆర్ పదేండ్ల కాలంలో విశేష అభివృద్ధి చేశారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ పాలనను అస్తవ్యస్తం చేస్తున్నది. ప్రజా పాలన పేరుతో తీసుకున్న దరఖాస్తులు ఎక్కడపోయాయో ప్రభుత్వం సమాధానం చెప్పాలి. ఇప్పటికే మూడు పంటలకు రైతు బంధు ఇవ్వలేదు. ఆరు గ్యారెంటీలు పూర్తి స్థాయిలో అమలు చేయలేదు. ప్రజలు మోసపోయామని మదనపడుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడితే జోకర్‌గా చూస్తున్నారు. గ్రామీణ నుంచి జిల్లా స్థాయి వరకు ప్రభుత్వ వైఫల్యాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి. అరాచక పాలనపై ప్రేక్షక పాత్ర పోషించవద్దు. సైనికుల్లాగా పనిచేయాలి.

**- కొప్పుల ఈశ్వర్, మాజీ మంత్రి**

## స్థానిక సంస్థల్లో గులాబీ రెపరెపలాడాలి

ఎమ్మెల్యే ఎన్నికల్లో జరిగిన తప్పులు స్థానిక సంస్థల ఎన్నికల్లో జరుగకుండా చూసుకోవాల్సిన బాధ్యత మీది, నాది, మనందరిది. శ్రేణులందరికీ పార్టీ సంపూర్ణ అండగా ఉంటుంది. పార్టీకి నిబద్ధతతో పనిచేసే వారికి సంపూర్ణ సహకారం అందిస్తా. అందరూ కలిసికట్టుగా పనిచేసి గ్రామగ్రామానా గులాబీ జెండా ఎగిరేలా చూసుకోవాల్సిన బాధ్యత మనందరిది. అరచేతిలో స్వర్గం చూపిన కాంగ్రెస్ మోసాలను ప్రజలకు వివరిద్దాం. ఎంపీటీసీ, కౌన్సిలర్, సర్పంచ్‌లుగా కావాలనుకునే వారంతా ప్రజా క్షేత్రంలో గట్టిగా నిలబడాలి.

**- కార్యకర్తలకు కేటీఆర్ నిర్దేశం**

## కుట్రలకు భయపడొద్దు



బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై కాంగ్రెస్ ప్రభుత్వం పెడుతున్న అక్రమ కేసులు, కుట్రలకు భయపడాల్సిన పనిలేదు. కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధిలో ముందు వరుసలో నిలిచింది. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కక్షపూరిత రాజకీయాలు చేస్తున్నది. ఇటీవల సిరిసిల్లలో బీఆర్ఎస్ నాయకులు బొల్లి రామ్మోహన్, జిందం దేవదాస్, అగ్గి రాములుపై రాజకీయ కక్షతోనే కేసులు పెట్టించారు. సిరిసిల్లలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అయ్యాయని వివిధ పత్రికల్లో వచ్చిన వార్తలు అవాస్తవం. కేటీఆర్‌ను బద్నాం చేయాలన్న కుట్రలో భాగంగానే తప్పుడు ప్రచారం చేస్తున్నారు. బీఆర్ఎస్ హయాంలోనే తప్పులు జరిగినట్లు చిత్రీకరిస్తున్నారు. వాస్తవానికి 2007లో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడే జంగ్ సిపాయి భూములకు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్స్(ఎన్‌వోసీ) అధికారులు ఇచ్చారు. ప్రభుత్వం ఇచ్చిన భూమిని అమ్ముకోవడానికి జంగ్ సిపాయికి అనుమతులు ఇచ్చింది. 2001లో చట్ట ప్రకారం కొనుగోలు చేసిన భూమి అక్రమం అంటూ కేసులు పెట్టారు. కాంగ్రెస్, టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు జరిగిన వాటిని బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగినట్టు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. బీఆర్ఎస్ నేతలపై పెట్టిన అక్రమ కేసులపై హైకోర్టుకు వెళ్లి పోరాటం చేసి నష్టపరిహారం చెల్లించేలా కృషి చేస్తాం. కార్యకర్తలు ఎవరూ అధైర్య పడొద్దు.

**- బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎంపీ**

## ధైర్యంగా పోరాడుతాం

అలవిమాలిన హామీలిచ్చిన మోసపూరిత కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లకాలం ఉండదు. మోసాలను ఎండగడుతున్న బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్న ప్రభుత్వంపై ధైర్యంగా పోరాడుతాం. కేసులను పరిష్కరించే దిశగా లీగల్ సెల్ రామన్న కనుసన్నల్లో ఎప్పటికప్పుడు పనిచేస్తుంది. కార్యకర్తలు అధైర్య పడాల్సిన అవసరం లేదన్నారు. ప్రజా క్షేత్రంలో ఉండి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి.

**- తోట ఆగయ్య, బీఆర్ఎస్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు**

# పంచాయతీ సమరానికి సమాయత్తం!

- ఎన్నికలకు సిద్ధమైన అధికారులు
- నోడల్ అధికారుల నియామకం
- జిల్లాకు చేరిన ఎలక్షన్ సామగ్రి
- సిద్ధమైన బ్యాలెట్ బాక్సులు
- సర్పంచ్ అభ్యర్థులకు 30 గుర్తులు, వార్డు సభ్యులకు 20 గుర్తులు ఖరారు
- బ్యాలెట్‌ల ముద్రణకు ప్రత్యేక పేపర్
- మొదటిసారిగా 'నోటా'కు చోటు
- బీసీ డిక్లరేషన్ అమలుచేస్తారా.. లేదా..? అన్నదానిపై స్పష్టత కరవు

పంచాయతీ ఎన్నికలకు అధికారయంత్రాగం ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నది. ప్రభుత్వ, ఎన్నికల కమిషన్ నుంచి వస్తున్న ఆదేశాల మేరకు సిద్ధమవుతుండగా, ఇప్పటికే ఆయా జీపీల ఓటర్లకు అనుగుణంగా అవసరమైన ఎన్నికల సామగ్రి జిల్లాలకు చేరింది. అంతేకాదు, సర్పంచ్‌లుగా పోటీ చేసే అభ్యర్థులకు సంబంధించి 30 గుర్తులు, వార్డు సభ్యులకు 20 గుర్తులు తాజాగా ఖరారయ్యాయి. అలాగే మొదటి సారి నోటాకు చోటు కల్పిస్తుండగా.. బ్యాలెట్ ఎక్కడికక్కడే ముద్రించేందుకు ఆదేశాలు వచ్చాయి. అయితే కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌కు అనుగుణంగా ఎన్నికలు జరుగుతాయా.. లేదా..? అన్నదానిపై అనేక సందేహాలు వ్యక్తమవుతుండగా, సర్కారు మాత్రం ఇప్పటికీ క్లారిటీ ఇవ్వలేదు. ప్రధానంగా సర్పంచ్ ఎన్నికలు ఆగిపోవడంతో పన్నెండు నెలలుగా కేంద్ర ఆర్థిక సంఘం నిధులు రాక పంచాయతీల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఈ నేపథ్యంలో ఏదో విధంగా ఎన్నికలు నిర్వహించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఉందని తెలుస్తున్నది. అయితే ఎన్నికల నోటిఫికేషన్ రావడం ఒక ఎత్తు అయితే, ఆ ఎన్నికలు జరిగే దాకా ఉత్కంఠ ఉంటుందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతున్నది.

కరీంనగర్, జనవరి 4 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ కరీంనగర్ కలెక్టరేట్ : గ్రామ పంచాయతీ ఎన్నికలకు అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే ఓటరు జాబితా రెడీ కాగా, పోలింగ్ స్టేషన్ల గుర్తింపు ప్రక్రియ కూడా పూర్తి చేశారు. ఎన్నికల నిర్వహణలో వివిధ విభాగాలకు సంబంధించి నోడల్ అధికారులను నియమించారు. తాజాగా పోటీ చేసే అభ్యర్థులకు కేటాయించాల్సిన గుర్తులు కూడా విడుదల కాగా, ఎన్నికల సామగ్రి సైతం జిల్లాకు చేరింది. జిల్లాల వారీగా ఎక్కడికక్కడే బ్యాలెట్ పేపర్లు ముద్రించుకోవాలని ఆదేశాలు రాగా, బ్యాలెట్ ముద్రణకు అవసరమైన ప్రత్యేక పేపర్ కూడా వచ్చింది. దీనిని స్ట్రాంగ్ రూమ్‌లో, మిగతా సామగ్రిని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ కార్యాలయంలో భద్రపరచడంతోపాటు ప్రింట్ చేసేందుకు ప్రెస్‌ల ఎంపిక కూడా పూర్తయింది. అయితే ముద్రణకు నిధులు విడుదల చేయకపోవడంతో ఆర్డర్లు ఇవ్వనట్టు తెలుస్తున్నది. పంచాయతీలకు పాలకవర్గాలు లేకపోవడం, ప్రత్యేకాధికారులకు పాలనపై పట్టులేకపోవడంతో గ్రామాలన్నీ అపరిశుభ్రతకు నెలవుగా మారాయనే విమర్శలను ప్రభుత్వం ఎదుర్కొంటున్నది. రోజురోజుకూ ఇవి తీవ్రమవుతుండడం, గ్రామాల్లో వ్యతిరేకత పెరుగుతుండడం వెరసి సాధ్యమైనంత తొందరలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాలతో యంత్రాంగం ఏర్పాట్లలో వేగం పెంచినట్టు తెలుస్తున్నది.

## సర్పంచ్‌లకు 30.. వార్డు సభ్యులకు 20 గుర్తులు


పంచాయతీ ఎన్నికలు విడుతల వారీగా నిర్వహించే అవకాశమున్నట్టు తెలుస్తుండగా, అందుకనుగుణంగానే అధికారులకు శిక్షణ శిబిరాలు కూడా ఏర్పాటు చేసేందుకు సమాయత్తమవుతున్నారు. స్టేజ్1, స్టేజ్ 2 స్థాయి అధికారులను కూడా నియమించి, వారికి క్లస్టర్ల బాధ్యతలు అప్పగించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఒక్కో క్లస్టర్‌లో ఆరు గ్రామ పంచాయతీలను చేర్చి, ఆయా జీపీల్లో పోటీ చేసే అభ్యర్థుల నుంచి క్లస్టర్ అధికారులు నామినేషన్లు స్వీకరించేలా, గుర్తుల కేటాయింపు చేపట్టేలా శిక్షణ ఇవ్వనున్నారు. ఎన్నికల ప్రక్రియ మొత్తం వీరి ఆధ్వర్యంలోనే పూర్తి చేసేలా ఆదేశాలు వచ్చినట్టు అధికారులు చెబుతున్నారు. క్లస్టర్ అధికారులుగా జిల్లా స్థాయి అధికారులను నియమించేందుకు కసరత్తు చేస్తున్నారు. వీరితో పాటు ప్రిసైడింగ్, అదనపు ప్రిసైడింగ్ అధికారులను కూడా గుర్తించి, అవసరమైన శిక్షణ ఇవ్వనున్నారు. ఆయా పంచాయతీలకు సరిపడేలా బ్యాలెట్లు ముద్రించనుండగా, ఈసారి బ్యాలెట్‌లో అభ్యర్థుల గుర్తులతోపాటు 'నోటా'ను కూడా ముద్రించనున్నారు. పింక్, వైట్ కలర్ పేపర్‌పై మాత్రమే బ్యాలెట్‌లు ముద్రించాలని ఎన్నికల సంఘం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు సిద్ధమవుతున్నారు. సర్పంచ్ అభ్యర్థులకు 30 గుర్తులు, వార్డు సభ్యులకు 20 గుర్తులు ఎంపిక చేయగా, పింక్ కలర్ పేపర్‌పై సర్పంచ్ అభ్యర్థుల గుర్తులు, వైట్ కలర్ పేపర్‌పై వార్డు సభ్యుల గుర్తులు ముద్రించనున్నారు. నామినేషన్ల ప్రక్రియ మొదలయ్యే వరకు ముద్రణ పూర్తయ్యేలా ప్రింటర్లను ఆదేశించినట్లు సమాచారం.



భద్రపరిచిన ఎన్నికల సామగ్రి

## బీసీ రిజర్వేషన్లు అమలు అయ్యేనా..?

కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా బీసీ డిక్లరేషన్ అమలు చేస్తుందా..? 23 శాతం నుంచి 42శాతానికి బీసీ రిజర్వేషన్లు పెంచుతామన్న మాట నిలుపుకొంటుందా.. లేదా..? అన్నదానిపై ఇంకా స్పష్టత రావడం లేదు. అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. తాము అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోపే స్థానిక సంస్థల్లో ప్రస్తుతమున్న బీసీ రిజర్వేషన్లను కులగణన, బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా 23 శాతం నుంచి 42 శాతానికి పెంచుతామని హామీ ఇచ్చింది. తద్వారా పంచాయతీలు, మున్సిపాలిటీల్లో కొత్తగా 23,973 మంది బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పిస్తామని మేనిఫెస్టోలో పేర్కొన్నది. నిజానికి 2019 జనవరిలో జరిగిన సర్పంచ్ ఎన్నికల సమయంలోనే సుప్రీంకోర్టు ఏ పరిస్థితుల్లోనూ రిజర్వేషన్లు 50 శాతం దాటొద్దని స్పష్టం చేసింది. ఆ మేరకు 2011 జనాభా లెక్కల ఆధారంగా అప్పటి పంచాయతీరాజ్ అధికారులు రాష్ట్రంలో రిజర్వేషన్లను ఖరారు చేశారు. గత పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు 22.79 శాతం, ఎస్సీలకు 20.53 శాతం, ఎస్టీలకు 6.68 శాతం చొప్పున రిజర్వేషన్లు కేటాయించారు. ఆ ప్రకారమే ఎన్నికలు నిర్వహించారు. అయితే ఇప్పుడు కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు పెంచి అమలు చేయాలని వచ్చిన ఒత్తిడి మేరకు రాష్ట్ర ప్రభుత్వం గత నవంబర్‌లో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ సర్వే ద్వారా బీసీ జనాభా లెక్కలు తెలిసినా.. పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం రిజర్వేషన్లు అమలుచేసి తీరుతుందా.. లేదా..? అన్నది చూడాలి. ఎందుకంటే.. దేశంలోని అత్యున్నత న్యాయస్థానం గతంలో ఇచ్చిన తీర్పు ప్రకారం రిజర్వేషన్లు ఏ పరిస్థితుల్లోనూ 50 శాతం దాటరాదు. ఈ నేపథ్యంలో బీసీ డిక్లరేషన్ అమలుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. అయితే ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోయినా.. ఎన్నికల నిర్వహణ వైపు అధికారులను సమాయత్తం చేస్తున్నట్టు తాజాగా వచ్చిన ఆదేశాలను బట్టి తెలుస్తున్నది.



**ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఆయా జిల్లాల వారీగా ఉన్న పంచాయతీలు, వార్డుల సంఖ్య వివరాలు**

| జిల్లా | మండలాలు | పంచాయతీలు | వార్డులు |
|---|---|---|---|
| కరీంనగర్ | 15 | 323 | 3022 |
| జగిత్యాల | 20 | 380 | 3500 |
| రాజన్నసిరిసిల్ల | 12 | 254 | 2230 |
| పెద్దపల్లి | 14 | 263 | 2436 |

# శాతవాహన రిజిస్ట్రార్‌గా రవి కుమార్ జాస్తి



రవి కుమార్‌కు పుష్పగుచ్ఛాన్ని అందిస్తున్న వీసీ ఉమేశ్ కుమార్

కమాన్‌చౌరస్తా, జనవరి 4: శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా ఉస్మానియా యూనివర్సిటీ కామర్స్ ప్రొఫెసర్, డైరెక్టరేట్ ఆఫ్ డిస్ట్రిక్ట్ పోస్ట్ గ్రాడ్యుయేట్ కాలేజెస్‌గా విధులు నిర్వర్తిస్తున్న రవి కుమార్ జాస్తి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు ఆయనకు వీసీ ప్రొఫెసర్ ఉమేశ్ కుమార్ స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. ఖమ్మం జిల్లాకు చెందిన ఆయన ఎంకాం, ఎంబీఏ, పీహెచ్‌డీ పూర్తిచేయగా, బోధన రంగంలో దాదాపు 24 ఏండ్ల అనుభవం ఉంది. ఆయన ఇప్పటి వరకు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో 40 పరిశోధనా పత్రాలను ప్రచురించగా, ఏడు పుస్తకాలను రచించారు. అంతేకాకుండా 10 వరకు అంతర్జాతీయ సెమినార్లు, 45 జాతీయ సెమినార్లలో పాల్గొన్నారు. ఆయన తెలంగాణ కామర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీగా, ఇండియన్ కామర్స్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడిగా వ్యవహరిస్తున్నారు. ఆయన గతంలో కేరళ సెంట్రల్ యూనివర్సిటీలో కామర్స్, ఇంటర్నేషనల్ బిజినెస్ విభాగానికి అధిపతిగా, సికింద్రాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ పోస్ట్ గ్రాడ్యుయేట్ కాలేజ్ ప్రిన్సిపాల్‌గా, అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్, ప్లేస్ మెంట్ ఆఫీసర్‌గా, ఓయూ సెంటెనరీ సెలబ్రేషన్స్ కోఆర్డినేటింగ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించారు. ప్రొఫెసర్ జీ రామిరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌కు, డైరెక్టరేట్ ఆఫ్ డిస్ట్రిక్ట్ పోస్ట్ గ్రాడ్యుయేట్ కాలేజీస్, ఉస్మానియా యూనివర్సిటీ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. అడ్మినిస్ట్రేటివ్ విభాగంలో పూర్తిస్థాయి అనుభవం ఉన్న ప్రొఫెసర్ రవికుమార్ రిజిస్ట్రార్‌గా నియామకం కావడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.